

యుద్ధం జరుగుతోంది. ఇరు వైపులా గాయపడు తున్నారు. గాయపడిన వాళ్ళని పక్కకు వేసుకుని వెళ్ళి ఉప చారాలు చేస్తున్నారు. కొత్తవాళ్ళు స్థానాల్ని తీసుకుంటున్నారు. జనుల హాహాకారాలు వినపడుతున్నాయి. ఏడుపులు, పెడబొబ్బలు-భీభత్సంగా వుంది.

* * *

ఆ ఊరేం చిన్నదికాదు. అలా అని మరీ పెద్దదీ కాదు. ఆ ఊరుని భారతదేశంతో పోల్చ వచ్చు. భారతదేశానికి ఆ ఊరికి కూడా మూడు పక్కలా నీరే.

మాగాణి భూములు, అరటి తోటలు,కొబ్బరి తోటలు...ఎక్కడ చూసినా పచ్చదనమే. ఊళ్ళో బడి, గుడి, పంచాయతి ఆఫీసు, రచ్చ బండ రాజకీయాలు- అన్నీ ఉన్నాయి.

చల్లటిగాలి చుట్టబెడుతూ ఆశ్వీజం

చక్కా వచ్చేసింది. చేలు— ఎక్కడ చూపినా మందుగుండు బరువుగా తలూపుతున్నాయి. చేతికి సామాను మాటలే.

# యుద్ధం

ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ



రాబోయే ఆదాయం లెక్క చూసుకుని మురిసిపోతున్నాడు రైతు. దీపావళి హడావిడి మొదలయింది.

కొండయ్య హడావిడి పడిపోతున్నాడు. మతాబులు, చిచ్చుబుడ్లు జువ్వలు-ఒకటేమిటి? అన్నీ,

తయారు చేయిస్తున్నాడు. పది మంది కుర్రాళ్ళు పగలు, రాత్రి పని చేస్తున్నారు. అంతా అతని మీదకు వచ్చేవారే!

"కొండయ్యా! నా మతాబులు."

"కొండయ్యా! చిచ్చుబుడ్లు..."

"జువ్వలు, తాటాకు కాయలు ఏమయ్యేయి? కట్టేవా?"

పాతికేళ్ళుగా అతనా ఊళ్ళో మందుగుండు సామాను కడుతున్నాడు. అతని ప్రావీణ్యత పక్క ఊళ్ళ వాళ్ళకి కూడా తెలుసు. అందుకే అంత జనం...

పోలిగాడు కంగారుగా వస్తూనే, "ఏం- రాజుగారి జువ్వ కట్టడం అయిందా?" అడిగేడు.

"ఒక గంటలో పంపిస్తాను" సర్ది చెప్పేడు కొండయ్య.

కొండయ్య చుట్టూ జనం ఉన్నారు.

కొండయ్య పాకకు నాలుగిళ్ళ ఇవతల పెంకుటింటి అరుగుమీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు చక్రయ్య. అతని పేరు చక్రధర రావు. కాని ఊరంతా అతన్ని చక్రయ్యనే పిలుస్తారు. దానికి కారణం అతను అప్పిచ్చి చక్రవడ్డీ కడతాడనే కావచ్చు. లేకుంటే చక్రధరరావు అని పిలవడం కష్టమనేనా కావచ్చు. మొత్తానికి అతన్ని పిల్చేది- చక్రయ్యని.

చక్రయ్యకు కొండయ్య ఇంటి కెళ్తున్న జనప్రవాహాన్ని చూస్తే ఒళ్ళు మండుకొస్తోంది. వంటికి (సూరే)కారం రాసుకున్నట్లుగా వుంది.

'ఆడేం వట్టినే ఇవ్వటం లేదు కదా? ఎందుకలా ఎగబడటం? తన దగ్గర కొనకూడదూ.... తనూ అదే రేటుకిస్తాడుగా!... కాని పెద్ద బేరాలన్నీ అటూ, బుడత బేరాలిటూ' తనలోనే గొణుక్కున్నాడు చక్రయ్య.

మెట్లు దిగి బయటకెళ్తున్న సుందరం, తండ్రి కోపంగా పళ్ళు నూరుకోవటం చూసి ఆగి పోయేడు. అతగాడు పట్నంలో బి.ఏ. చదువుతున్నాడు. సెలవులు కొచ్చేడు.

"ఏంటి నాన్నా! పనివాళ్ళు మందులు నూరుతున్నారు. నువ్విక్కడ కూర్చున్నా వేంటీ?" అడిగేడు.

"కొండయ్య ఇంటి కెళ్ళే జనాన్ని చూస్తున్నాను. అంతా అటే పోవకుంటే మనకాడికి రాకూడదా?" అన్నాడు చక్రయ్య నోట్లోంచి చుట్టతీసి.

"సరుకు బావుంటే వాళ్ళే వస్తారు."

"నా మొఖం! అలా పేరుమీద కొట్టుకుపోతున్నాడు. ఆడిది, నాది ఒకటే పాళ్ళు. అయితేనేం— పెద్దరాజుగారు ఆడిదగ్గరే, పెద్ద బేరాలు ఆడి దగ్గరే. అంతెందుకు-పెద్దరాజుగారికి, చిన్నరాజుగారికి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుందా? ఆ ఇంటిమీద కాకి ఈ ఇంటికి రాదు కదా! అయినా ఇద్దరూ కొండయ్యకాడే బేరం."

"ఏమాత్రం కొంటారూ?"

"చెరో అయిదువేలు జువ్వే కట్టిస్తారు."

"పోనీ, చిన్న రాజుగారిని కల్సుకుని అడగలేకపోయేవా?"

"అడిగేను. ఎప్పట్నుంచో ఆడికాడ చేయిస్తున్నాం. అంచేత కుదర్దు అనేశారు."

సుందరానికి ఆశ్చర్యం వేసింది. పెద్దరాజుగారి కుక్క—పోసారి తెలియక చిన్నరాజుగారి గుమ్మం ఎక్కిందని దాని కాలు విరిచేశారు. అలాంటిది ఇద్దరూ ఒకేచోట మందుగుండు సామాను కొనటమా!... ఆశ్చర్యంలో మునిగిపోయేడు.

సుందరం ఆశ్చర్యపోవటంలో చాలా రీజన్ ఉంది. పెద్దరాజుగారు, చిన్న రాజుగారు స్వయానా అన్నదమ్ములు. ఒకే కంచం, ఒకే మంచం-ఒకప్పుడు.

తండ్రి రాజుగారు కాలం చేశారు. దాంతో అనుభవం లేని అన్నదమ్ముల అలుసు చూసుకొని దాయాదులుఆక్రమించేశారు ఆస్తిని. ఊళ్ళో ఏదో వ్యాపారం చేసుకుంటామని వచ్చిన బంధువుకు ఆశ్రయమిస్తే, ఇసింటా రమ్మంటే ఇల్లంతా నాదేనన్నాడు వాడు.

రోడ్డున పడ్డ అన్నదమ్ములు కోర్టులు చుట్టూ తిరిగేరు. ఊరి అభిమానాన్ని సంపాదించారు. దాయాదికి ఊళ్ళో ఉప్పు పుట్టకుండా చేశారు. ఊరు పొమ్మంటోంది. కోర్టు తీర్పు చెప్పింది. దాయాది తోక ముడిచేడు.

ఇదంతా భారత దేశానికి స్వాతంత్ర్యం రాక ముందు జరిగింది. అటు దేశానికి స్వాతంత్రం, ఇటు వీళ్ళకి ఆస్తి ఒకేసారి వచ్చింది ఇంచుమించు.

చేతికి ఆస్తి రావటంతో కుటుంబాల మధ్య గొడవలు వచ్చేశాయి. ఈడి పాలేర్ని చూసి ఆడి పాలేరు ఉమ్మేడని, ఆడి పాలేర్ని చూసి ఈడిపాలేరు మీసం దువ్వేడని ఆవేశాలు పెంచేసుకున్నారు. పీకలు నరికేసుకున్నారు.

ఇంటి పెద్ద పోస్టు ఎప్పటికీ పెద్దరాజుకే ఉండిపోతుందని చిన్న

రాజుకి కన్ను కుట్టింది. పంపకం కావాలన్నాడు. పొలాలు- నీళ్ళతో కాక రక్తంతో తడపటం చూసి. కళ్ళ నీళ్ళు పెట్టుకుని మహాత్ములు, మహానుభావులు నచ్చచెప్పినా విన లేదు.

ఆస్తులు పంచేసుకున్నారు. సరిహద్దులు కట్టేసుకున్నారు. ఈ పొలం మీద వరికంకు నమిలిన పిట్ట, అటు వెళ్ళి ఆ నోటితో ఆ వరికంకు ముట్ట కూడదు. అందుకే అంత ఆశ్చర్యపోయేడు సుందరం.

తండ్రి దిగులుగా ఉండటం చూసి సహించలేక పోయేడు సుందరం.

"పోనీలే నాన్నా! నేను అమ్మ తాను గాని ఓ పది వేలు ప్రేలుడు జువ్వ తయారు చేయించు" అన్నాడు.

"పది వేలు ప్రేలుడు జువ్వా! మతి పోయిందా? టైం లేదు. ఎట్టా అమ్ముతావు?"

"అవన్నీ నా కొదిలేయి. చేయించు—అంతే!" ఖండితంగా అన్నాడు సుందరం.

* * *

దీపాల వరుసలు. పెద్ద రాజు గారి మేడ మీద ప్రమిదలే. పూరి గుడిసె ముందు ప్రమిదలే. ఒకటి ఇత్తడిది, మరొకటి మట్టి ప్రమిద కావచ్చు. కాని వెలుగు ఒక్కటే! సంబరము ఆనందము ఒక్కటే!

చిన్న పిల్లలు మతాబులు కాలుస్తున్నారు.

కుర్రాళ్ళు సిసింద్రీలు వదులుతున్నారు.

యువకులు జువ్వలు పేలుస్తున్నారు.

మనవడి చేతి కాకరపువ్వొత్తి కాల్పిస్తూనే మరుగుపడిన ముచ్చట తీర్చుకుంటున్న మామ్మలు.

మామ్మలు కాలుస్తుంటే, బోసి నవ్వుల్తో చూస్తున్న తాతయ్యలు.

"బావా! ఈ బాటు పేల్చు చూద్దాం—చేత్తో పట్టుకుని" అంటూ బావని ఆటపట్టిస్తున్న మరదళ్ళు, నవ్వుతున్న అక్కలు.

పిల్లల సరదాలు చూసి మురిసిపోతున్న దంపతులు. అంతా వెలుగే- అంతా హడావిడే!

పెద్దరాజుగారింటి ముందు మరీ హడావిడిగా వుంది. ఆయన అరుగు మీద పడక కుర్చీలో కూర్చున్నాడు. చాలా మంది అక్కడకు చేరారు.

పెద్ద పాలేరు పోలిగాడు- ముందు గుండు సామాను అందిస్తున్నాడు. యువకులు కాలుస్తున్నారు. ఆయన చూసి ఆనందిస్తున్నారు.

ఎవరైనా వచ్చి కాల్చవచ్చు కాని ఆ ముంగిట్లోనే కాల్చాలి.

జువ్వలు రకరకాలుగా కాలుస్తున్నారు. ఔట్లు పేలుస్తున్నారు.

సగ్గా వీధి చివరన ఉన్న చిన్న రాజుగారింటి ముందు అంత హడావిడి జరుగుతోంది. చిన్న రాజుగారు స్వయంగా నిలబడి యువకుల్ని ఉత్సాహపరుస్తున్నారు. గాలిలో జువ్వలు విన్యాసాలు చేస్తున్నాయి. సుందరం వచ్చి చిన్న రాజుగారింటి ముందు నిలబడ్డాడు. పదిహేను మంది కుర్రాళ్ళు ఒక్కసారి జువ్వలు వదుల్తున్నారు.

ఒక జువ్వ దారి తప్పినా-తన గమ్యం తెల్సినట్లు తిన్నగా వెళ్ళి వీధి చివర నిలబడిన పెద్దరాజుగారి మీద పడింది

ఎటో చూస్తూ నిలబడిన పెద్ద రాజుగారు కంగారు పడ్డారు. జువ్వ కంగారు పెట్టింది. ఆయన తూలి పడ్డారు-పంచె ఊడం పడడంతో.

"ఎవర్రా- నేలబారు జువ్వ వేసింది? వేయడం రాకుంటే తప్పుకోండి'' చీవాట్లు వేశారు చిన్న రాజుగారు. అయితే ఎవరు వేసింది తేలలేదు.

క్రింద పడిన పెద్దరాజుగారు లేచి గోచిని సవరించుకుని కళ్ళెర్ర చేసి చిన్నరాజు మేడకేసి చూచారు. అంతే! నాలుగు జువ్వలు నేలబారున వెళ్ళి చిన్నరాజుగారిని పరివారాన్ని చుట్టుముట్టాయి.

చిన్న రాజుగారు కంగారు పడ్డారు.

"పొరపాటున మీదపడితే కవ్విస్తాడా? వదలండి!" ఆజ్ఞాపించేరాయన.

ఎనిమిది జువ్వలు పెద్ద రాజుగార్ని, పరివారాన్ని గోడచాటుకు పంపేయి.

గబగబా తలుపులు మూసుకున్నాయి. పిల్లా మేకా ఇంట్లోకి పరుగులు తీసారు.

"వదలండిరా! ఈవేళ అటో, ఇటో తేలిపోవాలి!'' గర్జించేరు పెద్ద రాజుగారు.

జువ్వల యుద్ధం ఆరంభమైంది. చిన్న రాజుగారు రథం గోడని ఆనుకొని నిలబడ్డారు. పరివారం వెనక్కి సర్దుకున్నారు.

ఉత్సాహవంతులైన యువకులు ముందుకు దూసుకెళ్ళి జువ్వలు వదులుతున్నారు. ప్రత్యర్థులు వేసే జువ్వలవల్ల ఒళ్ళుకాలి వెనక్కి తగ్గుతున్నారు. వాళ్ళ స్థానాన్ని మరొకళ్ళు తీసుకుంటున్నారు. కొంతమంది ఒళ్ళు కాలిన వాళ్ళని ప్రక్కకు తీసుకుని వెళ్ళి కొబ్బరి నూనె పట్టిస్తున్నారు.

భీకరపోరాటంలో గురి తప్పుతున్న జువ్వలు తాటాకు కొంపల్ని మంట పెడుతున్నాయి. పిల్లలు, పెద్దలు హాహాకారాలు చేస్తున్నారు. యుద్ధం జరుగుతూనే వుంది. ఇళ్ళు ఆర్పుకొనే వాళ్ళు ఆర్పుకుంటున్నారు. ముందుగానే పాకల్ని కొందరు తడుపుకుంటున్నారు. అసహాయత వలన ఎవరూ నోరెత్తి మాట్లాడటంలేదు. వాళ్ళ కర్మల్ని వాళ్ళు నిందించుకుంటున్నారు.

"అయ్యా! మన దగ్గర జువ్వ అయిపోతోంది." కంగారుగా అన్నాడు చిన్న రాజుగారి పాలేరు.

"మనం వేయటం మానేస్తే ఓడినట్లే!" ఎవరో అన్నారు.

"వెళ్ళండి! జువ్వ ఎక్కడ దొరుకుతుందో చూడండి!" హుంకరించారు చిన్న రాజుగారు.

"చక్రయ్య దగ్గర ఉండొచ్చు!" ఇంకొకరు అన్నారు.

"వెళ్ళండి! ఎంతలేటయినా సరే పట్రాండి!" ఆవేశపడిపోతున్నారు చిన్న రాజుగారు.

ఢాం-అని ప్రేలిన జువ్వ పెద్ద రాజుగార్ని, పరివారాన్ని కంగారు పెట్టింది.

"ప్రేలుడు జువ్వరా! తయారుగానే యుద్ధం మొదలెట్టారు వాళ్ళు."

"అయ్యగారూ! మన జువ్వ అయిపోతోందండి."

"ఓరేయ్, ఇలారా! ఈ వెనక వీధిలోంచి వెళ్ళు- రథం దగ్గర కెళుతుంది. వాళ్ళకా జువ్వ ఎక్కడిదో కూపి లాగి రా!" ఆజ్ఞాపించారు పెద్ద రాజుగారు.

గూఢచారి పరుగెత్తుకొని వెళ్ళి వగరుస్తూ వచ్చాడు.

"అయ్యో! బాబో! కొన్ని వేల జువ్వ వుంది. ప్రేలుడు జువ్వండి. చక్రయ్య జువ్వ బాగా పోతోందని అనుకుంటున్నారు" చెప్పేడు గూఢచారి.

"వెళ్ళండిరా! లెక్క ఎంతైనా వెనకడుగు వేయద్దు. వెళ్ళండి చక్రయ్య దగ్గరకు!" హెచ్చరించేరు పెద్ద రాజుగారు.

ప్రత్యర్థుల్నించి ప్రేలుడు జువ్వ రావటంతో చిన్న రాజుగారు ఆశ్చర్యపోయారు.

"వాళ్ళు తయారుగానే ఉన్నారు. కానీయండ్రా- దూసుకెళ్ళండి" అన్నారాయన.

ఇళ్ళు, వాకిళ్ళు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. ఉడుకు రక్తం వెర్రి ఎత్తిపోతోంది. చల్లారిన రక్తం ఏమీ చేయలేక చూస్తోంది.

యుద్ధం జరుగుతూనే వుంది.

ఆ వీధిలో మధ్యనున్న ఎత్తు డాబామీద నిలబడి యుద్ధం చూస్తున్న చక్రయ్య కొడుకు సుందరంకేసి తిరిగి,

“నీవి భలే బుఱ్ఱరా” అన్నాడు మెచ్చుకోలుగా.

“ఇందులో పెద్ద తెలివి ఏముంది నాన్నా! మారణాయుధాలు చేసేవాడైనా, మందు గుండు సామాను చేసేవాడైనా బాగుపడాలంటే యుద్ధం జరగాల్సిందే! యుద్ధం జరుగుతోంది. ఆ వెలుగులో మనిల్లు చక్కబెట్టుకోవాలి” అన్నాడు అసలు సిసలు పౌలయిట్ అమెరికన్ నవ్వు నవ్వి సుందరం.

* * *

యుద్ధం జరుగుతూనే వుంది. ✱


# శ్రీ బాలాజీ వైద్యశాల

సెక్సు స్పెషలిస్టు **డా॥ పి. కుమారస్వామి దేవర**

హెడ్డాఫీస్:—5/1, బ్రాడీపేట, గుంటూరు-2 (ఎ.పి.)
బ్రాంచీలు: మార్వాడి గుడివద్ద, తెనాలి, ఫోన్ : 551.
26, నార్త్ బోగ్ రోడ్, మద్రాస్-17.

## దీర్ఘవ్యాధులకు వుత్తమ వైద్యము



దురభ్యాసములకు లోనై దాంపత్య సుఖము పొందలేని వారికి, (నిరుత్సాహముచే ప్రాణహాని చేసుకొనరాదు.) హెర్నియా, చర్మవ్యాధులకు పోస్టు ద్వారా కూడా చేయబడును.

వరిబీజం (బుడ్డ), మూత్ర వ్యాధులకు ఇసోనోఫీలియా (దమ్ము), ఉబ్బసమునకు ఆపరేషన్ లేకుండా చేయబడును; స్వయంగా వచ్చి సంప్రదించవలెను.

NB: “శివలీల” తెలుగు పక్షపత్రిక అన్ని విషయములతో వెలువడుతుంది; చదవండి.

ఎడిటర్:- డా. పి. కుమారస్వామి దేవర,
గుంటూరు (ఎ.పి.)